ప్రమాణ స్వీకారం చేస్తున్న నరసింహారాజు

పదో వార్డ్ కౌన్సిలర్‌గా నరసింహారాజు

బొల్లారం, ఆగస్టు 29: బొల్లారం మున్సిపాలిటీ పదో వార్డు కౌన్సిలర్‌గా కమ్మరి నరసింహారాజు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా సెషన్స్ జడ్జి తీర్పును అమలుపరుస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం, కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ తాత్కాలిక కార్యాలయంలో చైర్‌పర్సన్ కోలన్ రోజా బాల్ రెడ్డి అధ్యక్షతన కౌన్సిలర్‌గా నరసింహా రాజు చేత కమిషనర్ మంగతాయారు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నాయకులు కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలి

జిన్నారం, ఆగస్టు 29: రాళ్లకత్వ గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 286లో ఏర్పాటు చేస్తున్న క్రషర్‌ను నిలిపేయాలని గ్రామస్తులు గురువారం తహసీల్దార్‌ను కోరారు. ఈమేరకు తహసీల్దార్ భిక్షపతిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇదే సర్వే నంబర్‌లో కొంత మంది రైతులు అసైన్డ్ భూములను క్రషర్‌కు విక్రయించారని, మరికొంత మంది లీజుకు ఇచ్చారన్నారు. దీనిపై విచారణ జరిపి భూములు విక్రయించిన, లీజుకు ఇచ్చిన వారి భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. కొడకంచి రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 282, 283, 284, 285లో ఉన్న భూములను సర్వే చేసి విచారణ జరపాలని తప్పుడు సమాచారంతో దరఖాస్తు చేశానని, విచారణను నిలిపేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి తహసీల్దార్‌ను వినతిపత్రం ఇచ్చారు. రాళ్లకత్వ, శివనగర్, దాదిగూడెం, సోలక్‌పల్లి గ్రామస్తులు ఉన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్, సిబ్బందిని సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

న్యాల్‌కల్, ఆగస్టు 29: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మండలంలోని హద్నూర్ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చేడు అలవాట్లు దూరంగా ఉండి, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. స్థానిక కళాశాలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన అశోక్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బందిని శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో జహీరాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశం, అధ్యాపకులు అర్జున్, జగదీశ్వర్, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 29: ఎయిడ్స్ నియంత్రణపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని గురువారం తారా ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ సహకారంతో తారా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో పటాన్‌చెరు, సదాశివపేట, జహీరాబాద్, సంగారెడ్డి మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలతోపాటు జిల్లాలోని పలు డిగ్రీ కళాశాల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, జిల్లా ఏయిడ్స్ నియంత్రణ విభాగం అధికారి డేనియల్ మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందు లేదని, నివారణ ఒక్కటే మార్గం అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, అధ్యాపకులు మల్లిక, డాక్టర్ సదయ్య కుమార్, డాక్టర్ జోత్స్న, డాక్టర్ వెంకటేశం పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

సదాశివపేట, ఆగస్టు 29: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో శంకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మద్దికుంట ప్రాథమికోన్నత పాఠశాల, మద్దికుంట తండా ప్రాథమిక పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాలు పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేశ్, సిరాజొద్దీన్, రేణుక, నర్సింలు, సీఆర్పీలు రాజేశ్వర్, నాగరత్నం పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మిలో తులం బంగారం ఇవ్వాలి

ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎంపీ సురేశ్‌షెట్కార్

కోహీర్, ఆగస్టు 29: ఆడపడుచులకు కల్యాణలక్ష్మి చెక్కుతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తన హామీని నెరవేర్చాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు డిమాండ్ చేశారు. గురువారం జహీరాబాద్ పట్టణంలో ఆయా మండలాలకు చెందిన 617మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెక్కుల పంపిణీలో ఆలస్యం చేస్తున్నారని, బంగారం గురించి మాట్లాడితే ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ కూడా ఇస్తామంటున్నాడని, కాలయాపన చేయకుండా ఆడపడుచులకు అందించాలన్నారు. తులం బంగారం కోసం మహిళలు ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన 22మందికి రూ.6.80ల క్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, విజయ్‌కుమార్, తట్టునారాయణ, నర్సింహులు ఉన్నారు.

చెలికుంట'లో ఆక్రమణల తొలిగింపు

ఎన్‌సీసీ నిర్మాణ సంస్థకు చెందిన ప్రహరీని జేసీబీతో కూల్చివేయిస్తున్న అధికారులు

రామచంద్రాపురం, ఆగస్టు 29: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ గ్రామంలో చెలికుంటకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌లో వెలిసిన నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. ఇటీవల తెల్లాపూర్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ చెరువులు, కుంటలను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌లో షెడ్‌లు, ప్రహరీ, వరద కాల్వ ఆక్రమణ ఆయన దృష్టికి వచ్చింది. దీంతో అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా చెలికుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌లో నిర్మించిన షెడ్‌లు, ప్రహరీని కూల్చివేశారు. ముప్పా నిర్మాణ సంస్థ వరద కాల్వను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేశారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ సంతోషీ నేతృత్వంలో ఈ కూల్చివేతలు జరిగాయి. తెల్లాపూర్ పరిధిలోని చెరువులకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో జరిగిన నిర్మాణాలు అన్నింటిని కూల్చివేసి చెరువులు, కుంటలను కాపాడాలని తెల్లాపూర్ ప్రజలు అధికారులను కోరుతున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నారాయణఖేడ్, ఆగస్టు 29: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న వారు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ద్వారా అవకాశం కల్పిస్తున్నదన్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా నిర్ణీత రుసుము చెల్లించి ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కోహీర్, ఆగస్టు 29: మూగ బాలికపై లైంగికదాడి చేసిన కేసులో నేరస్తుడికి జీవితఖైదు పడింది. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ జబ్బార్ టైల్స్ పని చేసేవాడు. 2018లో మూగ బాలికపై లైంగికదాడి చేశాడు. అప్పట్లో చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో అతడిపై కేసు నమోదైంది. గురువారం సంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టులో వాదోపవాదాలు విన్న జడ్జి నేరస్తుడికి జీవిత కాల శిక్ష విధిస్తూ రూ.20వేల జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పారని డీఎస్పీ వివరించారు.

విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీ

కోహీర్, ఆగస్టు 29: మండలంలోని బడంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన అంతప్పగూడెం గణేశ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం నోట్‌బుక్కులు, తదితర సామగ్రిని అందజేశారు. విద్యార్థులకు సహాయం అందించినందుకు సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లింగాల సంగమేశ్వర్, శ్రీధర్, బ్రుందన, హెచ్ఎం శ్రీనివాస్, విద్యార్థులున్నారు.

నేడు ఖాజీపల్లిలో వైద్య శిబిరం

జిన్నారం, ఆగస్టు 29: మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో శుక్రవారం ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్‌వీఎం దవాఖాన వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం 10గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. శిబిరంలో ఉచితంగా ఆరోగ్య, కంటి పరీక్షలు నిర్వహిస్తారని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదాయపన్నుపై ఉద్యోగులకు అవగాహన

రామచంద్రాపురం, ఆగస్టు 29: ఆదాయ పన్నుపై భెల్ ఉద్యోగులకు ఆదాయపన్ను శాఖ అధికారులు అవగాహన కల్పించారు. గురువారం బీహెచ్ఈఎల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆదాయ పన్ను శాఖ టీడీఎస్ కమిషనర్ కొక్కిలిగడ్డ జగ్జీవన్‌రావు హాజరయ్యారు. టీడీఎస్, టీసీఎస్‌కి సంబంధించి ఆదాయపు పన్ను చట్టం 1961 నిబంధనలను వివరించారు. ఉద్యోగులు, కాంట్రాక్టర్ల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో భెల్ హెపీఈపీ ఈడీ కేబీరాజా, సీపీపీపీ ఈడీ శ్రీనివాసరావు, ఫినాన్స్ జీఎం హెచ్ మాలతి, ఏజీఎం పీవీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మనస్తాపంతో భెల్ ఉద్యోగి ఆత్మహత్య

రామచంద్రాపురం, ఆగస్టు 29: మనస్తాపంతో భెల్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో నివాసం ఉండే సత్యహనుమఅర్జున్‌రావు(39) భెల్‌లో పని చేస్తున్నాడు. అతడి తండ్రి చిన్నతనంలోనే మరణించగా తల్లి 2017లో మృతి చెందింది. అతడికి 2015లో వివాహం కాగా, ఇద్దరి మధ్య జరిగిన గొడవలతో 2022లో విడాకులు తీసుకున్నారు. ఎవరూ లేక ఒంటరి వాడు కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రమేశ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి సోదరి మంగతాయారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్‌పాం తోటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

చౌటకూర్, ఆగస్టు 29: మండలంలోని సరాఫ్‌పల్లిలో రైతు కరణం హనుమంతరావు సాగు చేస్తున్న ఆయిల్ పాం తోటను గురువారం సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్‌విశ్వకర్మ, కె.సరిత క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన వన శాఖ ప్రోత్సహంతో రైతులు విరివిగా ఆయిల్ పాం తోటలను సాగు చేస్తున్నారన్నారు. వీరి వెంట వైపీఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

భేషరతుగా రుణమాఫీ చేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు

సదాశివపేట: జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



అందోల్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 29: జిల్లాలోని రైతులందరికీ భేషరతుగా రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీని జిల్లా వ్యాప్తంగా అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2.70 లక్షల మంది రైతులుంటే ఇప్పటివరకు మూడు విడతల్లో 97,873 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయ్యిందన్నారు. సాంకేతిక కారణాలను చూపుతూ రుణమాఫీ చేయకపోవడం సరికాదన్నారు. అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, మాణిక్యం, సాయిలు, యాదగిరి, నర్సింలు, కృష్ణ, మల్లారెడ్డి, విఠల్ పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

సదాశివపేట, ఆగస్టు 29: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, సర్వే పేరుతో కాలయాపన చేయొద్దని సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. రుణమాఫీపై మంత్రులు రోజుకో ప్రకటన చేయడంతో రైతుల్లో ఆందోళన నెలకొన్నదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎండీ ఖయ్యూం, శ్రీనివాస్, మహేశ్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందోల్‌లో...

అందోల్, ఆగస్టు 29: అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేయాలన్నారు.

మునిపల్లిలో..

మునిపల్లి, ఆగస్టు 29: రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మునిపల్లి తహసీల్దార్ ఆశాజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకుడు రమేశ్ గౌడ్ మాట్లాడుతూ రుణ మాఫీ కాని రైతులు బ్యాంకుల వద్దకు వెళ్లి ఆరా తీస్తే బ్యాంకు అధికారులు రైతులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

కంది, ఆగస్టు 29: అర్హులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సింలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కంది డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు పేరుతో అర్హులకు అన్యాయం జరుగుతున్నదన్నారు. ఏకకాలంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి కొర్రీలు పెట్టడం సరైంది కాదన్నారు. రైతులకు న్యాయం జరుగకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆనంద్, సంజీవులు, నర్సింలు, రాజు, మల్లేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గాం, పిట్లం బస్సు ప్రారంభం

సిర్గాపూర్: అంతర్గాంలో బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సిర్గాపూర్, ఆగస్టు 29: మండలంలోని అంతర్గాం, పిట్లం బస్సును గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశయ్యతో కలిసి అంతర్గాంలో ప్రారంభించారు. స్థానిక ఆశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతీ మహారాజ్ బస్సుకు పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మనీశ్‌పాటిల్, మాజీ సర్పంచ్ రవి పటేల్, శ్రీనివాస్‌రావుపాటిల్, ఆర్టీసీ పీఆర్‌వో పాండు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

సిర్గాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో 36 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్థానిక తహశీల్దార్ ఉమాశంకర్‌తో కలిసి అందజేశారు. అనంతరం స్థానిక కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక హైస్కూల్‌ను సందర్శించి క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు.

కంగ్టిలో..

కంగ్టి, ఆగస్టు 29: మండల కేంద్రం కంగ్టిలోని ఓ ఫంక్షన్‌హాలులో గురువారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణు సాగర్, పీఏసీఎస్ చైర్మన్ మారుతిరెడ్డి, మాగి సీడీసీ చైర్మన్ షాదుల్, సిద్దేశ్వరాలయ కమిటీ చైర్మన్ దారం వెంకన్న, డీప్యూటీ తహసీల్దార్ జూబేర్, బసిరెడ్డి, కృపేందర్‌రెడ్డి, పరశురాం, శ్రీనివాస్‌రెడ్డి, దావీద్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

కల్హేర్, ఆగస్టు 29: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి వైద్యులకు సూచించారు. గురువారం మండల కేంద్రమైన కల్హేర్‌లోని సర్కార్ దవాఖానకు ఎంఆర్ఎఫ్ అండర్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సహకారంతో అందించిన నూతన అంబులెన్స్ వాహనాన్ని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. నాయకులు పోచయ్య, భాస్కర్‌గుప్త, నర్సింహారెడ్డి, మల్లేషం, శ్రీనివాస్‌గౌడ్, వీర్‌శెట్టి, దేవదాస్, గోపాల్, తుకారాం పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి

మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్

సదాశివపేట, ఆగస్టు 29: శాంతియుత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్ అన్నారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో గణేశ్ నవరాత్రి, నిమజ్జన ఏర్పాట్లపై గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల ఏర్పాటు, విద్యుత్, రోడ్ల మరమ్మతులు, శోభాయాత్ర సమయంలో ఉండే సమస్యలపై చర్చించారు. పండుగలను సామరస్యంగా జరుపుకుందామని, పోలీసు అధికారులకు సహకరిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే మున్సిపల్ ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమ, బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్ పాటిల్ పాల్గొన్నారు.

పేదల ఇండ్ల జోలికి వస్తే ఊరుకోం



మార్క్స్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఐ నాయకులు

సంగారెడ్డి, ఆగస్టు 29: జిల్లా కేంద్రంలోని మార్క్స్‌నగర్‌లో పేదలు అధికసంఖ్యలో ఉన్నారని, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇండ్లకు మార్క్ చేశారని, పేదల ఇండ్ల జోలికి వస్తే సీపీఐ పోరాటానికి సిద్ధమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహబూబ్‌ఖాన్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని మార్క్స్‌నగర్‌లో పర్యటించి అధికారులు వేసిన మార్క్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 29వ వార్డులో 30ఏండ్లుగా పేదలు ఇండ్లు నిర్మించుకొని జీవనోపాధి పొందుతున్నారని, ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందని పేదల ఇండ్లకు ఎసరు పెడితే చూస్తూ ఊరుకోమని, వచ్చేనెల 2న కలెక్టరేట్ ఎదుట పేదలతో కలిసి ధర్నా చేస్తామన్నారు. మూప్పై ఏండ్లుగా నల్లా బిల్లు, కరెంటు బిల్లులు కడుతున్నా మున్సిపల్, రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు వజీర్ బేగ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కాశీనాథ్, అనురాధ, గౌసోద్దీన్, శంకరయ్య, గౌస్ బాబా, శంశోద్దీన్, విజయ్, కర్ణాకర్, రజియాబేగం, తుల సమ్మ, శోభ, పోచమ్మ, నారమ్మ, కాలనీవాసులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్‌వో సంగారెడ్డి

అందోల్, ఆగస్టు 29: విధుల్లో నిర్లక్ష్యం వద్దని, రోగుల పట్ల అంకితభావంతో పనిచేయాలని డీసీహెచ్‌వో సంగారెడ్డి ఆదేశించారు. గురువారం జోగిపేట దవాఖానలో తనిఖీలు నిర్వహించి సూపరింటెండెంట్ సౌజన్యతో సమావేశమయ్యారు. సిబ్బందిపై తరుచూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో పాండు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

అందోల్, ఆగస్టు 29: పరిసరాలు శుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలని ఆర్డీవో పాండు సూచించారు. గురువారం పలు వార్డుల్లో డ్రైడే నిర్వహించి ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. రోజువారీగా చెత్తను పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని వర్షం, మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు రన్‌ఫర్ ఫిట్‌నెస్ పోటీలు

కంది, ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌సీసీ క్యాడెట్లకు గురువారం రన్‌ఫర్ ఫిట్‌నెస్ పోటీలు నిర్వహించారు. కంది మండలం ఓడీఎఫ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయంతివాణి పోటీలను ప్రారంభించారు. ఎన్‌సీసీ అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ ఫిజికల్ ఫిట్‌నెస్ సాధించేందుకు ప్రతిఒక్కరూ క్రీడలు, ఆటలు, వ్యాయామం, యోగా వంటివి దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే యువత శారీరకంగా, మానసికంగా బలంగా ఉండాలని, అప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. యువత వ్యసనాలకు బానిసలై దేశానికి భారంగా మారొద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత, రవీందర్, చవాన్ సుభాస్‌సింగ్, శ్రీనివాసరావు, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నారాయణఖేడ్, ఆగస్టు 29: నారాయణఖేడ్‌లోని పండ్ల వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు మోహీద్ పటేల్ అన్నారు. గురువారం పట్టణంలోని పండ్ల వ్యాపారుల సంఘం ఆధ్వర